బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అరసవల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బాలల సంరక్షణ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని జిల్లా అదనపు పర్యవేక్షణ అధికారి టీవీ.రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకున్నవారు విజయవాడలోని బాలల సంక్షేమశాఖ కార్యాలయానికి ఈ నెల 11వ తేదీలోగా స్పీడ్‌పోస్టు/రిజిష్టర్ పోస్టు ద్వారా దరఖాస్తులు అందజేయాలన్నారు. సంబంధిత వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు పొందుపరచి ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు 9100045398, 9440035576 నెంబర్లను సంప్రదించాలని కోరారు.



టెక్కలి: ఎండలమల్లన్నను దర్శించుకుంటున్న భక్తులు



జలుమూరు : శ్రీముఖలింగంలో పూజలు

శివోహం

- సందడిగా కార్తీక సోమవారం
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు

'ఓం నమశ్శివాయ' అంటూ కార్తీక మాసం మొదటి సోమవారం శివుడి దర్శనానికి భక్తులు పోటెత్తారు. టెక్కలి మండలం రావివలసలో ఎండల మల్లన్న ఆలయం.. శివనామస్మరణతో మార్మోగింది. దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన శ్రీముఖలింగంతోపాటు శ్రీకాకుళంలోని ఉమారుద్రకోటేశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఇలా జిల్లాలోని శైవక్షేత్రాలన్నీ సోమవారం వేకువజాము నుంచే భక్తులతో కిక్కిరిసిపోయాయి.

6లో



శ్రీకాకుళం కల్చరల్ : ఉమారుద్ర కోటేశ్వరుడికి అభిషేకం

బెల్టు కావాలా నాయనా!

'బెల్టుషాపులు పెడితే తాట తీస్తా. ఫైన్ కాదు.. ఏకంగా మూసేయడమే'..

-ఈ నెల 1న ఇచ్ఛాపురం మండలం ఈదుపురం సభలో సీఎం చంద్రబాబు నాయుడు చేసిన హెచ్చరిక ఇది..

..కానీ ఈ హెచ్చరికలు బేఖాతర్ అవుతున్నాయి. బెల్టుషాపులకు వేలం పాటలు కొనసాగుతున్నాయి. వైసీపీ హయాంలో మాదిరే వ్యవహారం నడుస్తోంది. గార మండలంలో వైసీపీ నేతలు, పెద్దల సమక్షంలో ఈ తీర్మానం జరగ్గా.. కూటమి నాయకులు కూడా పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సంబంధిత అధికారుల తీరుపైనా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పరిస్థితి ఇలానే ఉంటే గ్రామగ్రామాన బెల్టుషాపులు తెరుచుకోవడం ఖాయమన్న చర్చ సాగుతోంది.





- జొన్నలపాడులో అనధికార వేలం
- రూ.2 లక్షలకు ఐదు షాపుల ఖరారు
- వైసీపీ నేతల సమక్షంలో తీర్మానం
- ప్రభుత్వం మారినా.. మారని తీరు
- సీఎం చంద్రబాబు హెచ్చరికలు బేఖాతర్
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

శ్రీకాకుళం క్రైం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి)

గార మండలం రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడులో ఐదు బెల్టుషాపుల నిర్వహణకు.. రెండేళ్లకుగానూ రూ.2లక్షలకు వైసీపీ నాయకులు, గ్రామ పెద్దల సమక్షంలో వేలం పాట ఖరారు చేశారు. ముగ్గురు వ్యక్తులు తప్ప ఇంకెవరూ బెల్టుషాపులు పెట్టి మద్యం విక్రయించరాదని నిర్ణయించారు. ఆదివారం జరిగిన ఈ వేలం పాట దృశ్యాన్ని కొందరు యువకులు వీడియో తీయగా.. అది సోమవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. ఇంత జరుగుతున్నా.. కూటమి నేతలు మాత్రం తమకు ఏమీ తెలియదని ఉండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల అనంతరం కొన్ని నియోజకవర్గాల్లో వైసీపీ నేతలతో కలిసి కూటమి శ్రేణులు చేసిన ఇసుక వ్యాపారం మాదిరి.. బెల్టు దుకాణాల వేలం కూడా జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నా.. బెల్టు దుకాణాల వేలం వ్యవహారంపై స్థానిక పోలీసులకు, ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కూటమి నేతలు ఎందుకు ఫిర్యాదు చేయడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు ఎక్సైజ్ అధికారులు కూడా కనీస చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. గతంలో ప్రభుత్వం మద్యం దుకాణాలు నిర్వహించగా.. ఒకరికి మూడు బాటిళ్ల కన్నా అధికంగా విక్రయించేవారు కాదు. ఇటీవల మద్యం దుకాణాలను ప్రైవేటుపరం చేయడంతో వాటిపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఈ క్రమంలో నిబంధనలు తుంగలో తొక్కి.. ప్రైవేటు దుకాణాల నుంచి బెల్టుషాపులకు మద్యం విచ్చలవిడిగా సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లోని బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు జోరందుకున్నాయి. ఈ బెల్టు దుకాణాలకు వైసీపీ నాయకులే

(మిగతా 6వ పేజీలో..)



జొన్నలపాడులో బెల్టు షాపులకు వేలం

13న ఆదిత్యుని తెప్పోత్సవం

అరసవల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత.. ప్రత్యక్షదైవం.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి హంస నావికోత్సవాన్ని(తెప్పోత్సవం) ఈ నెల 13న నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో వై భద్రాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్తీకమాసం క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా దేవేరులతో సహా స్వామి ఉత్సవమూర్తులను విశేష అలంకరణతో ఇంద్ర పుష్కరిణిలో నావలో ఊరేగిస్తారు. ఈ ఉత్సవానికి ఏటా సుమారు 10వేల మంది భక్తులు హాజరవుతారు. కాగా.. గతేడాది పుష్కరిణి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినా.. ఇప్పటివరకూ పనులు చేపట్టలేదు. అలాగే పుష్కరిణిలో నీరు కలుషితమై భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పుష్కరిణితోపాటు పరిసరాలను శుభ్రం చేయాలని భక్తులు కోరుతున్నారు.



అరసవల్లిలో ఆదిత్యుడి ఆలయం

రూ.కోట్ల ఆదాయం... అభివృద్ధి శూన్యం

- అరసవల్లిలో అధ్వానంగా ఇంద్ర పుష్కరిణి
- స్నానాలకు భక్తుల ఇక్కట్లు

6లో

ఎస్‌బీఐ మేనేజర్ శ్రీకర్ సస్పెన్షన్

- నరసన్నపేట బ్రాంచ్‌లో రుణాల కుంభకోణమే కారణమా?

శ్రీకాకుళం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గార ఎస్‌బీఐలో తాకట్టు పెట్టిన బంగారు ఆభరణాల మాయం కేసు మరువక ముందే.. ఈ ఏడాది ఏప్రిల్‌లో నరసన్నపేట ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రుణాల కుంభకోణం వెలుగుచూసింది. దీనిని విజిలెన్స్ అధికారులు గుర్తించి.. బ్రాంచ్ మేనేజర్ శ్రీకర్‌ను విధుల నుంచి తొలగించారు. ఆయన సస్పెన్షన్‌ను హోల్డ్‌లో

(మిగతా 6వ పేజీలో..)



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

6లో



ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి


- ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్ రెడ్డి
- ఏఈని సస్పెండ్ చేయాలని ఆదేశం

8లో

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

7లో

ఏం పనులు చేశారు.. బిల్లులెంత?



కేరాశింగి రహదారి పనులు ఇలా..



- ఐటీడీఏ రహదారి పనులపై విజిలెన్స్ ఆరా!
- రూ.33.1 కోట్ల వినియోగంపై దర్యాప్తు
- ఇంజనీరింగ్ శాఖలో కలకలం

మెళియాపుట్టి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి)

సీతంపేట ఐటీడీఏ పరిధిలో రహదారి పనులపై విజిలెన్స్ దృష్టి సారించింది. గత ఐదేళ్లు ఏయే పనులు చేశారు.. ఎంత మేర బిల్లులు చెల్లించారనే విషయంపై ఆరా తీస్తోంది. నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేస్తుండడంతో అప్పట్లో వైసీపీ నేతల అక్రమాలకు సహకరించిన ఇంజనీరింగ్ అధికారుల్లో గుబులు రేగుతోంది. వైసీపీ పాలనలో గత ఐదేళ్లు ఆ పార్టీ నాయకులే.. అధికారులుగా వ్యవహరించి ఇష్టారాజ్యంగా పనులు చేసి.. బిల్లులు చేయించుకున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో కొంతమంది బినామీలను ఏర్పాటు చేసుకుని.. పనులు చేయించిన విషయం తెలిసిందే. అధికారులు సైతం పనుల వద్దకు వెళ్లేందుకు భయపడే పరిస్థితి ఉండేది. దీంతో వైసీపీ శ్రేణులే కాంట్రాక్టర్లుగా, వాళ్లే ఇంజనీరింగ్ అధికారులుగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. దీంతో రహదారి పనుల్లో నాణ్యతలోపించి మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలాయి. నిధులు దుర్వినియోగమయ్యాయి. వీటిపై ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. దీంతో విజిలెన్స్ దర్యాప్తునకు ఆదేశించినట్టు తెలుస్తోంది. గతంలో రూ.54.88 కోట్ల వ్యయంతో 36 రహదారి పనులు చేశారు. ఇందులో రూ.21.87 కోట్లతో చేపట్టిన 16 రహదారుల పనుల్లో అక్రమాలు జరిగినట్టు ఫిర్యాదులు అందాయని సమాచారం.

పనులిలా..

మెళియాపుట్టి మండలంలో నేలబొంతు - చందనగిరి రహదారికి రూ.96 లక్షలు మంజూరయ్యాయి. పరశురాంపురం జంక్షన్ నుంచి కేరాశింగికి రూ.42 లక్షలు, కేరాశింగి నుంచి గూడకు రూ.1.11 కోట్లు మంజూరు చేశారు. హిరమండలం, మందస, పలాస మండలాల్లో రూ.1.90 కోట్లతో పుట్టిగాం-బంగారుగూడ రహదారికి రూ.1.90 కోట్లు, గొయ్యిగూడ- జోడుమనుగూడ రహదారికి రూ.50 లక్షలు, నారయగూడ-గదబవలస రహదారికి రూ.1.80 లక్షలు మంజూరయ్యాయి. బొమ్మిక రిజర్వాయర్ నుంచి నారయగూడకు, వెలపగూడ - పాత రేగులపాడు పనులకు రూ.2కోట్లు కేటాయించారు. మందసలో వాసుదేవుని ఆలయం పాత తహసీల్దార్ కార్యాలయం వరకూ రూ.2కోట్లు మేర పనులు చేశారు. ఉమాగిరి పాఠశాల నుంచి ఉమాగిరి గ్రామం వరకూ మరో రూ.2 కోట్లు, ఆర్అండ్‌బీ రహదారి నుంచి ఈతమానుగూడకు రూ.90 లక్షలు మంజూరు చేశారు. కొండలోగాం-తబ్బగాం రహదారికి రూ.1.80 లక్షలు, చీపి-బుడంబో రహదారికి రూ.1.85 లక్షలు మంజూరయ్యాయి. పాత ఎన్‌హెచ్-5 నుంచి బిన్నాళా వయా బిమదనాపురం వరకూ రూ.1.50 లక్షలు కేటాయించారు. సరవ తులసీగాం-చీపి వయా బుడారిసింగి గ్రామాలకు రూ.1.30లక్షలు మంజూరు చేశారు. కాగా.. ఈ గ్రామాల్లో పనులు సక్రమంగా చేయకుండా బిల్లులు చేయించుకున్నారనే ఫిర్యాదులు విజిలెన్స్ అధికారులకు వెళ్లినట్టు తెలుస్తోంది. అప్పట్లో ఓ మంత్రి.. గిరిజనశాఖలో తన పలుకుబడిని ఉపయోగించి.. అధికంగా నిధులు మంజూరు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఆ పీఏల ప్రమేయంతోనే?..

గత ప్రభుత్వంలో పాతపట్నం నియోజకవర్గంలో పనులకు సంబంధించి.. ఒక ప్రజాప్రతినిధి వ్యక్తిగత పీఏలతోపాటు ప్రభుత్వం నుంచి వచ్చిన పీఏలు సెటిల్‌మెంట్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. బినామీలతో పనులు చేయించి.. బిల్లులు చేయించుకున్నారనే విమర్శలు వినిపించాయి. కొంతమంది కాంట్రాక్టర్లుకు పనులు ఇచ్చి.. కమీషన్లు తీసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. పాతపట్నం మండలంలో ఒక పంచాయతీ సర్పంచ్ పేరుతో బిల్లులు చేయించుకోగా.. అ సర్పంచ్ అడ్డుతిరగడంతో బ్యాంకు అధికారుల ద్వారా లెటర్ పెట్టించి.. చెక్ డబ్బులు నిలిపేశారు. చాలా చోట్ల రహదారి పనుల్లో అక్రమాలు జరగ్గా.. ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తుతో ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారులు ఉలిక్కిపడుతున్నారు. అప్పటి అక్రమాలు తమ మెడకు చుట్టుకుంటాయోమోనని ఆందోళన చెందుతున్నారు.


రావివలస ఎండల మల్లన్నకు భక్తుల పూజలు

శివోహం

- సందడిగా కార్తీక సోమవారం
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- వేకువజాము నుంచే బారులు

టెక్కలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారం శివాలయాలకు భక్తులు పోటెత్తారు. రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆంధ్ర, ఒడిశా ప్రాంతాలకు చెందిన భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఉచిత, సర్వ, శిఖర దర్శనాలను దేవదాయ శాఖ ఏర్పాటు చేసింది. క్యూలైన్లలో భక్తులకు ఉచిత ప్రసాదాలు, మజ్జిగ, తాగునీటిని సరఫరా చేశారు. ఈవో గురునాథరావు, సీఐ విజయ్‌కుమార్‌లు భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి ఎండల మల్లన్నను దర్శించుకున్నారు. అనంతరం దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీత పుష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరించి ఎండల మల్లన్నతో పాటు నంది విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. గ్రానైట్ పరిశ్రమ యంత్రాంగం, జీఎస్ జ్యూయలర్స్ సంస్థలు, రావివలసకు చెందిన నార్ల కృష్ణమూర్తి, టెక్కలి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసు యంత్రాంగం చర్యలు చేపట్టింది. దీంతో పాటు టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, మెళియాపుట్టి పరిసర ప్రాంతాలల్లోని వివిధ శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస తొలి సోమవారం కావడంతో శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. నగరంలోని నాగావళి నది ఒడ్డున ఉన్న ప్రసిద్ధి చెందిన ఉమారుద్ర కోటేశ్వర స్వామిని తెల్లవారు జామున మూడు గంటల నుంచి భక్తులు దర్శించుకున్నారు. మహాన్యాస పూర్వక అభిషేకాలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో స్వామిని పూలతో అలంకరించారు. మహిళలు ముందుగా నందీశ్వరుని వద్ద దీపాలు వెలిగించి.. అనంతరం స్వామికి పూజలు చేశారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యూలైన్‌లో ఉన్న వారికి ఉచిత ప్రసాదాలు, మంచినీటి ప్యాకెట్లు అందజేశారు. అదే విధంగా కొన్నావీధిలోని భీమేశ్వర ఆలయంలో భక్తులు పూజలు చేశారు. నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరాలయంలో అర్చకులు బి.అశ్విని కమార్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. శివ, మహేష్ ఆధ్వర్యంలో ప్రసాదాలు అందజేశారు. గుజరాతీపేటలో ఉన్న లక్ష్మేశ్వర స్వామి, బలగలోని ఉత్తరేశ్వర తదితర ఆలయాల్లో స్వామిని భక్తులు దర్శించుకున్నారు. వైష్ణవ ఆలయాల్లోనూ భక్తుల రద్దీ కనిపించింది. నారాయణ తిరుమల, చిన్న బజార్‌లో ఉన్న దూది వారి వేంకటేశ్వర స్వామి ఆలయం తదితర చోట్ల భక్తులు పూజలు చేశారు.


శ్రీకాకుళం నక్కవీధిలో రుద్రాక్షలతో శివలింగం


పూజలందుకుంటున్న శ్రీముఖలింగేశ్వరుడు

శ్రీముఖలింగంలో భక్తుల సందడి!

- గత ఏడాది కంటే తగ్గిన వైనం

జలుమూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగంలో గల శ్రీముఖలింగేశ్వర స్వామిని మొదటి కార్తీక సోమవారం భక్తులు దర్శించుకొని తరించారు. వేకువ జాము నుంచే పవిత్ర వంశధార నదిలో భక్తులు స్నానాలాచరించి స్వామిని దర్శించుకున్నారు. అభిషేకాలు చేసి పునీతులయ్యారు. ఉదయం 10 గంటల తరువాత ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. స్వామి దర్శనార్థం బారులు తీరారు. గత ఏడాది మొదటి సోమవారం వచ్చిన భక్తుల సంఖ్యతో పోలిస్తే ఈ ఏడాది తగ్గింది. ఉచిత, ప్రత్యేక దర్శనాలకు వచ్చే వారికి వేర్వేరు బారికేడ్లు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎండ తగలకుండా ఉండేందుకు ఆలయ ఆవరణలో షామియానాలు వేశారు. ఆలయ ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. స్వామిని దర్శించుకొని వెలుపలికి వచ్చే భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది గ్రామంలో ఉచిత ఆరోగ్య వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. కొమనాపల్లి సాయి భక్తులు క్యూలో ఉన్న భక్తులకు వాటర్ ప్యాకెట్లు అందించారు. శ్రీముఖలింగేశ్వర స్వామితో పాటు సోమేశ్వర, భీమేశ్వరాలయాల్లోనూ భక్తులు పూజలు చేశారు.



శ్రీకాకుళం ఉమారుద్ర కోటేశ్వరాలయంలో క్యూలైన్‌లో భక్తులు


శ్రీకాకుళం ఉమాజఠలేశ్వరాలయంలో వేచి ఉన్న భక్తులు

ఎస్‌బీఐ మేనేజర్ శ్రీకర్ సస్పెన్షన్

(ఐదో పేజీ తరువాయి)

ఉంచారు. దాదాపు ఆరు నెలల తర్వాత.. బ్రాంచ్ మేనేజర్ శ్రీకర్‌ను సస్పెండ్ చేస్తూ ఎస్‌బీఐ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. అయితే.. తనను అన్యాయంగా తొలగించారని, ఇన్ని నెలల తర్వాత చర్యలేదంటూ మేనేజర్ శ్రీకర్.. బ్యాంక్ అధికారులను నిలదీసినట్లు సమాచారం. 'అప్పటి ఆర్‌ఎం రాజుకు అన్నీ తెలుసు. బ్యాంక్ కోసం ఎంతో శ్రమించా'నంటూ అధికారుల వద్ద శ్రీకర్ ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా తొలుత నరసన్నపేట బ్రాంచ్‌లో ఎటువంటి అవకతవకలు జరగలేదన్న అధికారులు.. విజిలెన్స్ తనిఖీలో వాస్తవాలు బయట పడటంతో ఈ చర్యలు తీసుకున్నట్లు బ్యాంకు సిబ్బంది బాహాటంగానే చెబుతున్నారు. గార బ్యాంకులో బంగారం ఆభరణాల తాకట్టు కేసులో కూడా తొలుత ఆర్‌ఎం మీడియాకు ఎటువంటి అవకతవకలు జరగలేదన్నారు. పోలీసులు తీగ లాగితే పెద్ద డొంకే కదిలింది. అదే మాదిరి నరసన్నపేట బ్రాంచ్‌లో కూడా ఇదే సీన్ రిపీట్ కాగా.. ఈ కుంభకోణంలో బ్యాంక్ మేనేజర్ ఒక్కడినే బలి చేశారన్న విమర్శలు గుప్పుమంటున్నాయి. ఈ వ్యవహారంలో బ్యాంకు మేనేజర్‌తో పాటు సహకరించిన సిబ్బందిపై చర్యలెక్కడన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


ఇంద్ర పుష్కరిణిలో పేరుకుపోయిన చెత్త

రూ. కోట్లలో ఆదాయం.. అభివృద్ధి శూన్యం

- అధ్వానంగా ఇంద్ర పుష్కరిణి
- స్నానాలకు భక్తుల ఇక్కట్లు
- టిక్కెట్ల ఆదాయం తగ్గింది ఎందుకో!
- ఇదీ అరసవల్లి ఆలయ పరిస్థితి


స్నానాల గది వద్ద కుక్కల విహారం


పనిచేయని మంచినీటి కొళాయిలు

అరసవల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అది ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దేవాలయం. భక్తులకు ఆయుష్షును... ఆరోగ్యాన్ని ప్రసాదించే ప్రత్యక్ష దైవంగా ప్రతీతి. ఏటా కోట్లాది రూపాయల ఆదాయం. అదే అరస వల్లిలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయం. నిత్యం దేశం నలు మూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అక్కడికి వస్తుంటారు. స్వామి వారికి తలనీలాలు సమర్పించి... ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరిస్తుంటారు. ఆదిత్యుని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

● పుష్కరిణిలో స్నానం చేస్తే...

ఇంద్ర పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తే ఆరోగ్యం మాట అటుంచి... అనారోగ్యం పాలవడం ఖాయంగా కనిపిస్తోంది. గత వైసీపీ హయాంలో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశాలతో పుష్కరిణి అభివృద్ధి పనుల పేరుతో అందులోని నీటిని మొత్తం తోడేశారు. కానీ పనులు మాత్రం ప్రారంభించలేదు. పుష్కరిణిలో నీరు లేక భక్తులు నిరాశతో వెనుదిరిగే వారు. కానీ తరువాత వర్షాలు కురిసి కొంత నీరు పుష్కరిణిలో చేరింది. అప్పటి నుంచి నాచుపట్టి, దుర్గంధంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అనంతరం దీనిని నింపే ప్రయత్నంలో భాగంగా బయటి కాలువల నుంచి నీటిని పంపించారు. కానీ చెత్తా, చెదారం, కాలువల నుంచి వచ్చిన మురుగునీటితో పుష్కరిణి పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. బదిలీల పేరిట తరచుగా ఆలయ అధికారులు మారుతుండడం... సిబ్బంది నిర్లక్ష్యం... వెరసి పుష్కరిణిని గాలికి వదిలేశారు. ఆరోగ్యం కోసం ఆలయానికి వస్తే.. అనారోగ్యానికి గురికావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని భక్తులు వాపోతున్నారు.

● స్నానాల గదుల్లో కుక్కల బెడద

కేశఖండన శాలలో తలనీలాలు సమర్పించిన భక్తులు స్నానాల గదుల వద్ద తలస్నానం చేసేందుకు వెళతారు. కానీ అక్కడ కుక్కల బెడద విపరీతంగా ఉంది. గతంలో ఒకే రోజు ఏడుగురు భక్తులను కుక్క కరచింది. ఈ మధ్యనే మరో ఇద్దరు భక్తులు కుక్క కాటుకు గురయ్యారు. ఈ విషయం ఆలయ సిబ్బందికి, అధికారులకు తెలిసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో భక్తులు స్నానాలు చేయాలంటే భయపడుతున్నారు.

● తగ్గిపోతున్న టిక్కెట్ల ఆదాయం

గతంలో ఆలయ ఆదాయంలో అధిక వాటా దర్శన టిక్కెట్ల ద్వారానే సమకూరేది. దాని తరువాత ప్రసాదాల అమ్మకం ద్వారా లభించేది. కొన్ని నెలలుగా టిక్కెట్ల అమ్మకం ద్వారా ఆలయానికి వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గిపోతోంది. నిజానికి ఎప్పుడూ ప్రసాదాల అమ్మకాల కంటే టిక్కెట్ల ద్వారా లభించే ఆదాయమే అధికంగా ఉండేది. కానీ ప్రస్తుతం ఆ ఆదాయం ప్రసాదాల అమ్మకం కంటే తగ్గిపోవడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే ప్రసాదాలు విక్రయించే చోట భక్తులు చేతులు కడుగుకునేందుకు ఏర్పాటు చేసిన 7 మంచినీటి కుళాయిల్లో రెండు మాత్రమే పని చేస్తున్నాయి. సూర్యనమస్కారాల మండపం వద్ద గల కాలువల్లో దుర్వాసన వస్తుండడంతో భక్తులు ముక్కు మూసుకుని ఆలయానికి దర్శనానికి వెళ్లే పరిస్థితి ఉంది. అరసవల్లి ఆలయ పరధిలోని అనారోగ్య పరిస్థితులను చక్క దిద్దడానికి...సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని భక్తులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అమ్మో.. యాప్‌లు!

- నిత్యం వీటితోనే కుస్తీ
- కేంద్రానిది ఒకటి... రాష్ట్రానిది మరొకటి
- బండెడు చాకిరీ.. చాలీచాలని జీతాలు
- ఇదీ అంగన్‌వాడీల దుస్థితి

నరసన్నపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బిడ్డ పుట్టినది మొదలు.. ఆరేళ్లు నిండే వరకు పౌష్టికాహారం అందించడంతో పాటు.. మూడు నెలల గర్భవతి నుంచి... ఏడాది బాలింత వరకు.. పోషణ... టీకాలు.. కుటుంబ సర్వే, ఆరోగ్య సర్వే ఇలా అన్ని పనులూ చేయాల్సింది అంగన్‌వాడీలే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన యాప్‌లు.. రికార్డుల నిర్వహణ భారాన్ని భరించలేక అంగన్‌వాడీ కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. అదే సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన అదనపు విధులు నిర్వహించలేక మనోవేదనకు గురవుతున్నారు. జీతం మూరెడు.. చాకిరీ బండెడు ఉందని.. తమపై భారం తగ్గించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.


తామరాపల్లి కేంద్రంలో పిల్లలకు బోధిస్తున్న కార్యకర్త

జిల్లాలో ఇలా...

జిల్లాలో నరసన్నపేట, ఆమదాలవలస, బూర్జ, ఎచ్చెర్ల, గార, ఇచ్ఛాపురం, కాశీబుగ్గ, కోటబొమ్మాళి, కొత్తూరు, మందస, పాతపట్నం, రణస్థలం, సారవకోట, సోంపేట, శ్రీకాకుళం, టెక్కలిలోని 16 ప్రాజెక్టుల పరిధిలో 2,759 మెయిన్ కేంద్రాలు, 599 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 9,667 మంది గర్భిణులు, 11,355 మంది బాలింతలు, 0-6 నెలల చిన్నారులు 9,933 మంది, 6-36 నెలల చిన్నారులు 55,489 మంది, 37-72 నెలల వయస్సు గల చిన్నారులు 39,939 మంది ఉన్నారు. వీరికి పౌష్టికాహారం అందించడంతో పాటు... సంక్షేమం విషయంలో అంగన్‌వాడీ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. మరో వైపు చిన్నారులకు ప్రీస్కూలు విద్యను అందిస్తున్నారు.

యాప్‌లలో ఏంచేయాలంటే...

అంగన్‌వాడీ కార్యకర్తలు విధిగా నాలుగు యాప్‌లు నిర్వహించాలి. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పోషణ టేకర్‌లో ప్రతి రోజు చిన్నారులు, గర్భిణులు, బాలింతల పోషణ వివరాలు నమోదు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన బాల సంజీవని యాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం అందించే పోషణ వివరాలు నోట్ చేయాలి. వీటితో పాటు రెండు యాప్‌లలో నిత్యం మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. ప్రీస్కూలు నిర్వహించి... ఆ ఫొటోలు అప్‌లోడ్ చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఫేషియల్ రికగ్నేషన్ హాజరు నమోదు చేయాలి. నెలకు ఒకసారి మిల్క్ యాప్‌లో వివరాలు నమోదు చేయాలి.

రికార్డుల భారం..

అంగన్‌వాడీ ఉద్యోగి 15 రికార్డులను నమోదు చేయాలి. ఆహారం వినియోగం రికార్డు (ఎఫ్‌సీఆర్), పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే అనుబంధ రికార్డు (ఎస్‌ఎన్‌టి), ప్రీ స్కూల్ అడ్మిన్ రికార్డులను నిత్యం నమోదు చేయాలి. వీటితో పాటు టీకా రికార్డు, విటమిన్-ఎ రికార్డు, రిఫరల్ సర్వీసెస్, గృహ సందర్శనలు రికార్డు చేయాలి. నెలవారీ ప్రాజెక్ట్ రిపోర్టు (ఎంటీఆర్), అంగన్‌వాడీ పరిధిలోని హౌస్‌హోల్డ్ సర్వే, గ్రోత్ రికార్డు, గ్రోత్ చార్టుతో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంబంధించిన రెండు టేక్ హోమ్ రేషన్(టీహెచ్‌ఆర్)ల సంతకాల రిజిస్టర్, స్టాఫ్ అడ్మిన్ రిజిస్టర్ సహా 15 రికార్డులు మోయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో తమపై ఈ భారాన్ని తగ్గించాలనే డిమాండ్‌తో అంగన్‌వాడీ ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

యాప్‌ల భారం తగ్గించాలి..



గ్రామాల్లో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడంలో అంగన్‌వాడీలను భాగస్వామ్యం చేస్తున్నారు. తల్లి గర్భంలో బిడ్డ పడిన నుంచి ఆ చిన్నారికి ఆరేళ్ల వయసు వచ్చే వరకు అంగన్‌వాడీ కార్యకర్తలు నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. తల్లికి, బిడ్డకు పోషణ, టీకాలు, వారి ఆరోగ్య కార్డులు, యాప్‌ల ద్వారా నిత్యం కేంద్రానికి ఒకసారి, రాష్ట్రానికి మరోసారి వివరాలను నమోదు చేయడం ఎంతో భారంగా మారుతోంది. యాప్‌లు, రికార్డుల నిర్వహణ భారం కొంత తగ్గించాలి.

-కల్యాణి, అధ్యక్షురాలు, జిల్లా అంగన్‌వాడీ వర్కర్స్ సంఘం

బండెడు చాకిరీ..



రోజంతా కష్టపడే మాకు కనీస వేతనం రూ.22వేలుగా నిర్ణయించాలి. యాప్‌లు, రికార్డుల భారం అధికమైంది. పిల్లల మానసిక ఎదుగుదలకు దోహద పడేవిధంగా ప్రీ స్కూల్ టీచర్‌గా శిక్షణ ఇచ్చి.. బోధనకు పరిమితం చేస్తే బాగుంటుంది. మూడేళ్ల నుంచి ఆరేళ్ల పిల్లల వరకు స్పోకెన్, రైటింగ్ స్కిల్స్‌తో పాటు నైతిక విలువలు పెంచే విధంగా అంగన్‌వాడీలకు శిక్షణ ఇవ్వాలి. బోధన బాధ్యతలు మాత్రమే అప్పగించాలి.

-సుధారాణి, ప్రధాన కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్స్ సంఘం

'బెల్టు' కావాలా నాయనా!

(ఐదో పేజీ తరువాయి)

కొమ్ముకాస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారుల నిఘా కొరవడడంతోనే ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా బెల్టుషాపుల నిర్వహణపై ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కొనసాగుతున్న వైసీపీ అక్రమాలు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా.. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వైసీపీ నేతల అవినీతి, అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 90 శాతం మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు గెలిచిన ఆ పార్టీ మద్దతుదారులే. గడిచిన ఐదేళ్లూ ఇసుకను దోచుకున్న మాదిరి.. నేడు బెల్టు దుకాణాల రూపంలోనూ జేబులు నింపుకొనే పనిలో పడ్డారు. జొన్నలపాడులోని వైసీపీ మద్దతుదారులైన ఇద్దరు ప్రజాప్రతినిధులు.. గ్రామ పెద్దలతో సభ నిర్వహించారు. బెల్టు దుకాణాల కోసం వేలం పాట వేశారు. కాగా.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన గ్రామసభ అనుకుని స్థానికులు అక్కడికి చేరుకోగా.. బెల్టుదుకాణాల వేలంపాట ప్రక్రియ చూసి అవాక్కయ్యారు. బెల్టు దుకాణాలు పెడితే చర్యలు తప్పవని సీఎం చంద్రబాబు హెచ్చరిస్తున్నా.. బహిరంగంగా వేలంపాట వేయడం చర్చనీయాంశమైంది. జిల్లాలోని చాలా గ్రామాల్లో ఇదే మాదిరి ఇసుక, మద్యం విక్రయాల్లో వైసీపీ నేతల పెత్తనం కొనసాగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

విచారణ చేస్తున్నాం..

జొన్నలపాడులో బెల్టుషాపుల కోసం వేలం పాట వేసిన విషయం మా దృష్టికి వచ్చింది. దీనిపై ఇప్పటికే విచారణ ప్రారంభించాం. డీసీ శ్రీకాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నిఘా పెంచాం. వేలం పాట ఘటనపై చర్యలు తీసుకుంటాం. గతంలో బెల్టు షాపులు నిర్వహించిన వారి జాబితా సిద్ధం చేశాం. వీరిపై నిఘా పెడతాం.

-గోపాలకృష్ణ, ఎక్సైజ్ సీఐ, శ్రీకాకుళం

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మీ కోసం' ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చే అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన 'మీకోసం' కార్యక్రమంలో 204 మంది అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులు ఆ అర్జీలను వ్యక్తిగతంగా పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వేంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీధరరాజు, ఉప కలెక్టర్ అప్పారావు, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

● ఓవరాల్ చాంపియన్‌గా కడప

● ద్వితీయ స్థానంలో విశాఖ

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కోడి రామ్మూర్తి స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ బాలబాలికల పోటీల ఓవరాల్ చాంపియన్‌గా కడప జిల్లా నిలిచింది. మొత్తం 11 బంగారు, నాలుగు రజిత, ఒక కాంస్య పతకంతో సత్తాచాటారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు సోమవారంతో ముగిసాయి. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విశాఖ జిల్లా ఐదు బంగారు, 10 రజిత, ఐదు కాంస్య పతకాలతో ద్వితీయస్థానంలో నిలిచింది. తూర్పుగోదావరి జిల్లా ఐదు బంగారు, ఒక రజిత, ఐదు కాంస్య పతకాలతో తర్వాత స్థానంలో నిలిచింది. అదేవిధంగా శ్రీకాకుళం ఒక బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలు సాధించగా, పశ్చిమ గోదావరి జిల్లా నాలుగు బంగారు, రెండు రజిత, మూడు కాంస్య పతకాలు, గుంటూరు జిల్లా మూడు బంగారు, నాలుగు రజిత, మూడు కాంస్య పతకాలు, కృష్ణ జిల్లా ఒక బంగారు, మూడు రజిత, రెండు కాంస్య పతకాలు సాధించాయి. ప్రకాశం జిల్లాకు చెరో బంగారు, కాంస్య పతకాలు, కర్నూలు జిల్లాకు మూడు బంగారు, రెండేసి రజిత, కాంస్య పతకాలు వచ్చాయి. అనంతపురం జిల్లా చెరో బంగా, రజిత, మూడు కాంస్య పతకాలు సాధించగా, నెల్లూరు ఒక రజితం, రెండు కాంస్య పతకాలు, చిత్తూరు జిల్లాకు ఒక కాంస్య పతకం వచ్చింది. ఇందులో మెరిట్ ఉన్నవారికి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని నిర్వాహకులు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ తెలిపారు.



పోల్‌వాల్ట్‌లో సత్తాచాటుతున్న క్రీడాకారుడు

రేపటి నుంచి రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీలు

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ తెలిపారు. వీరంతా ఈ నెల 6 నుంచి 9వ తేదీ వరకు విజయవాడ వేదికగా జరగనున్న ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా నుంచి అన్ని క్రీడలకు సంబంధించి 136 మంది క్రీడాకారులు అర్హత సాధించారన్నారు. ఇందులో అథ్లెటిక్స్‌కు 20 మంది, క్రికెట్‌కు 15 మంది, బ్యాడ్మింటన్‌కు 16 మంది, బాస్కెట్‌బాల్‌కు ఆరుగురు, వెయిట్ లిఫ్టింగ్‌కు ఒకరు, చెస్, కేరమ్స్‌కు చెరో నలుగురు, ఖోఖోకు 20 మంది, కబడ్డీకు ఎనిమిది మంది, రెజ్లింగ్‌కు ఒకరు, వాలీబాల్ నుంచి 19 మంది హాజరు కావల్సి ఉందని, ఫుట్‌బాల్‌కు ఐదుగురు, హాకీకు ఇద్దరు, టేబుల్ టెన్నిస్‌కు ఏడుగురు, యోగాకు ఆరుగురు, స్విమ్మింగ్‌కు ముగ్గురు ఎంపికైనట్టు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

శ్రీకాకుళం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేల్లో జరిగిన లోపాలను సరిదిద్దుకునేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. రూరల్ మండలం గేదెలవానిపేటలో సోమవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. తహసీల్దార్ గణపతిరావు, టీడీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

కంచిలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు రూ.20 వేలు పెట్టుబడిగా సాయం అందిస్తామని చెప్పిందని, వెంటనే ఆ సాయాన్ని అందించాలని రైతు సంఘం జిల్లా కో కన్వీనర్ ఎ.లోకనాథం, రైతు సంఘ నాయకులు ఎస్.నారాయణస్వామి అన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు రైతు సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు.

అధికారుల పరిశీలన

ఇచ్ఛాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఈదుపురంలో పర్యటించి ముఖ్యమంత్రి చంద్రబాబును తేలుకుంచి, బిర్లంగి గ్రామాల రైతులు చానల్స్ కోసం వినతి పత్రాన్ని అందించారు. దీనిపై స్పందించిన ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసరావు సోమవారం రెండు గ్రామాల్లో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనుల కోసం ఇరిగేషన్ అధికారులు పరిశీలించి రైతులతో మాట్లాడారు. లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

వర్సిటీ అధ్యాపకులకు అదనపు బాధ్యతలు

ఎచ్చెర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో పలువురు అధ్యాపకులకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.లోకేశ్వరికి ఎగ్జామ్ (కాన్ఫిడెన్షియల్) డీన్‌గా, డాక్టర్ జి.రామకృష్ణ (కంప్యూటర్ సైన్స్)కు వర్సిటీ వెబ్‌సైట్ సమన్వయకర్తగా, డాక్టర్ జి.ప్రకాష్‌బాబు (కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్)కు స్వర్ణాంధ్ర-2047 వర్సిటీ సమన్వయకర్తగా, డాక్టర్ ఎం.సుష్మారెడ్డి (ఫిజిక్స్) మూక్స్ సమన్వయకర్తగా, ఎ.గణేష్‌బాబు (ఇంజనీరింగ్ ఫిజిక్స్) స్వయం సమన్వయకర్తగా నియమించారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ పి.సుజాత ఉత్తర్వులు జారీ చేశారు. నియామక పత్రాలను వీసీ కేఆర్ రజని చేతుల మీదుగా అందజేశారు. ఎస్‌వో కె.సామ్రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

షెడ్లు పరిశీలన

రణస్థలం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద సేకరణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ప్రత్యేకాధికారి వెంకటరమణ అన్నారు. సోమవారం పైడిభీమవరం, జేఆర్ పురం ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను ఆయన పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలని, వీటి ద్వారా సంపద సృష్టించాలన్నారు. సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

తాగి డ్రైవింగ్ చేస్తే చర్యలు

ఇచ్ఛాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జరడా జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఒడిశాలో మద్యం తాగి వాహనం నడుపుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

మత్స్యకారులను ఆదుకుంటాం



చేప పిల్లలు విడిచిపెడుతున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వలసలు నివారించి మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. సింగుపురం పంచాయతీ మామిడివలసలో ఎమ్మెల్యే గొండు శంకర్ సోమవారం చేప పిల్లలను పంపిణీ చేశారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి 100శాతం రాయితీపై చేపలను పంపిణీ చేస్తున్నట్టు వివరించారు. స్వదేశీ మత్స్య సహకార సంఘాలకు, పీఎంఎంఎస్‌వై సంఘాలకు ఈ చేప పిల్లలను పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గంలో మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించడంలో విఫలం

జి.సిగడాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రైతులంటే అధికారులకు చులకనగా కనిపిస్తున్నారా? సాగునీరు అందించటంతో పూర్తిగా విఫలమయ్యారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు నీటి పారుదల అధికారులను నిలదీశారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైస్‌ఎంపీపీలు మీసాల సాధ్విమణి, టి.వెంకటరావు, ఎంపీడీవో రామకృష్ణ, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

అరసవల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ప్రభుత్వ మద్యంలో షాపుల్లో పనిచేసినవారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం మీకోసంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 3,600 మద్యం షాపుల్లో 15 వేల మంది పనిచేసేవారని, వారంతా ఇప్పుడు కుటుంబాలతో రోడ్డున పడ్డారన్నారు. వారికి న్యాయం చేయాల్సి బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు డోల శంకరరావు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజావారధి



అర్జీలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో సమావేశపు మందిరంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజావారధి కార్యక్రమం సోమవారం చేపట్టారు. వివిధ సమస్యలపై 160 అర్జీలు స్వీకరించారు. వాటి పరిశీలనకు సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే పంపించారు. ప్రత్యేకాధికారి వెంకటరమణ, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో ఈశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాదారుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఖాతాదారులు

ఎచ్చెర్ల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పోస్టాఫీసులో పొదుపు చేసిన డబ్బులు స్వాహా అయినట్టు గ్రామానికి చెందిన ఖాతాదారులు సోమవారం ఆ పోస్టాఫీసు ఎదుట ఆందోళన చేపట్టారు. ఖాతాదారులు తెలిపిన వివరాల మేరకు.. రికరింగ్ డిపాజిట్ (ఆర్డీ), ఇతర పొదుపు మొత్తాలను స్థానిక పోస్టాఫీసులో దాచుకున్నామన్నారు. గత మూడేళ్లుగా బీపీఎంగా పనిచేస్తున్న వ్యక్తి ఇటీవల మృతిచెందారు. ఈమె ఖాతాదారుల నుంచి పొదుపు చేసిన మొత్తానికి సంబంధించి పుస్తకాలు ఖాతాదారులకు ఇవ్వకుండా తన వద్దే ఉంచుకున్నట్టు ఖాతాదారులు చెబుతున్నారు. దీంతో కొంతమంది ఖాతాదారులు పోస్టాఫీసును రెండు రోజుల క్రితం సంప్రదించారు. అయితే పొదుపు చేసిన మొత్తం పోస్టాఫీసు పుస్తకాల్లో జమకాలేదని తెలిసి తామంతా మోసం పోయినట్టు ఖాతాదారులు గుర్తించారు. ఇలా చాలా మంది ఖాతాదారులు నష్టపోయినట్టు భావించి.. పోస్టల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం పోస్టల్ శాఖకు చెందిన నలుగురు సిబ్బంది ధర్మవరం పోస్టాఫీసును సందర్శించి తనిఖీ చేశారు. ఖాతాదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సుమారు రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు మోసపోయినట్టు ఖాతాదారులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము పొదుపు చేసిన డబ్బులను తిరిగి చెల్లించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధి 23వ వార్డు బెల్లుపడ కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జి శాసన శేఖర్ ఆధ్వర్యంలో ఆ వార్డు ప్రజలు ఎమ్మెల్యే బెందాళం అశోక్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన్ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.

● సోంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పలు రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు జాగృతి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రాంబుడ్డి గణపతి కోరారు. సోమవారం వినతి పత్రం సమర్పించారు.

అక్కమాంబ బోనాలు

పొందూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పొందూరు గ్రామ దేవత అక్కమాంబతల్లి బోనాలు సోమవారం ఘనంగా జరిగాయి. నాయుడు వీధి నుంచి బోనాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. భారీగా బాణాసంచా కాల్చారు. అమ్మవారిని పలు ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల దర్శించుకున్నారు. వీరివెంట కూటమి నాయకులు రామ్మోహన్, ఎ.విజయలక్ష్మి, ఎ.శివ ఉన్నారు.

జనవరిలో హైందవ శంఖారావం

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరిలో హైందవ శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రతినిధి శ్రీరంగం మధుసూధనరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఇందుకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షులు లోకనాథం, ప్రతినిధులు ఆనందరావు, కర్రే లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ఎస్పీ మీ కోసం'లో 65 వినతులు



అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఎస్పీ మీ కోసంలో 65 వినతులు వచ్చాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఏపీఎస్పీ మొదటి బెటాలియన్ (ఎచ్చెర్ల) అసిస్టెంట్ కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఎం.గోపాలకృష్ణ, రెండో పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.ఈశ్వరరావు వేర్వేరుగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

హోంగార్డు కుమారుడికి కారుణ్య నియామకం

శ్రీకాకుళం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆగస్టులో హోంగార్డు టి.కాంతారావు మృతి చెందడంతో అతడి కుమారుడు సత్యనారాయణకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం కారుణ్య నియామక పత్రాన్ని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అందజేశారు. అలాగే రాష్ట్ర చీఫ్ ఆఫీస్ సెంట్రల్ వెల్ఫేర్ నుంచి మంజూరైన రూ.40 వేలు చెక్కును కాంతారావు భార్య లక్ష్మికి ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, డీపీవో ఏవో సీహెచ్ గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించాయి: మాజీ మంత్రి సీదిరి



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న మాజీ మంత్రి సీదిరి

శ్రీకాకుళం క్రైం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ఇందుకు పలాసలో వైసీపీ కార్యకర్తలపై కత్తులతో టీడీపీ కార్యకర్తల దాడి ఘటనే నిదర్శనమని మాజీ మంత్రి, వైసీపీ నాయకులు సీదిరి అప్పలరాజు అన్నారు. ఈ ఘటనపై బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న మీకోసంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. అభివృద్ధికి నిలయమైన పలాసను రాక్షస ప్రాంతంగా మార్చేశారన్నారు. పోర్టులు, హార్బర్లు ప్రైవేటీకరణ చేస్తామన్న చంద్రబాబు.. మత్స్యకార బతుకులను ప్రైవేట్ వ్యక్తులకు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. దీనిపై ప్రజాక్షేత్రంలో ఇంటింటికి వెళ్లి పోరాడతానని స్పష్టం చేశారు.

ఉపాధి పనుల్లో కాంట్రాక్టర్ల పేర్లా?

అరసవల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎన్ఆర్ఈజీఎస్ మెటీరియల్ కాంపొండ్ పనుల్లో స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ, ఎమ్మెల్సీ పేర్లు లేకుండా మండల టీడీపీ కార్యదర్శి, కాంట్రాక్టర్ల పేర్లు ఉండడం అన్యాయమని, కేంద్ర నిధులతో చేపట్టే పనుల్లో కూడా స్థానిక ప్రజా ప్రతినిధుల పేర్లు లేకపోవడం దారుణమని మాజీమంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ కార్యాలయంలో నిర్వహిస్తున్న 'మీకోసం' కార్యక్రమంలో ఈ విషయమై కలెక్టర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు.

కాలువల అనుసంధానం చేపట్టాలి

బూర్జ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓనిగెడ్డ కాలువలను తోటపల్లి కాలువలకు అనుసంధానం చేయాలని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు అన్నారు. సోమవారం రాజుపేటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఓనిగెడ్డ కాలువ 7,600 ఎకరాలకు భూమిని నీటిని అందించే ఉద్దేశంతో 1937లో ప్రారంభమైందన్నారు. గత నాలుగేళ్లగా ఓనిగెడ్డల్లో కాలువలు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో శివారు భూములకు నీరందని పరిస్థితి ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఓనిగెడ్డ చానల్‌ను తోటపల్లి కాలువకు అనుసంధానం చేసి రైతులను ఆదుకోవాలన్నారు.

బకాయిలు తక్షణమే విడుదల చేయాలి

అరసవల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన, వసతి దీవెన బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 50,956 మంది విద్యార్థులు వసతి దీవెనకు అర్హులని, పెండింగ్‌లో ఉన్న రూ.105 కోట్ల నిధులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పడకపోవడంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. ఆర్డీవో వెంకటేశ్వరరావు వచ్చి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని కళాశాలకు అధికారికంగా నోటీసులు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సంతోష్, జిల్లా గర్ల్ కన్వీనర్ పి.పవిత్ర, నాయకులు నగేష్, చెన్నారావు, సింహాద్రి, జీవిత డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వీఆర్ఏల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేకుంటే సీసీఎల్ఏ కార్యాలయం వద్ద ఈ నెల 18న పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వీఆర్వో సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు అల్లు సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.త్రినాథరావు, కె.రమణమూర్తి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు వారు సోమవారం ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకు వీఆర్ఏలు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, ఇసుక వద్ద నైట్ డ్యూటీలు రద్దు చేయాలని, ప్రమోషన్లు ఇవ్వాలని, నామినీలను వీఆర్ఏలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చాలన్నారు. అనంతరం మీకోసంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు సీతప్పడు, అప్పారావు, పురుషోత్తం, రాములమ్మ, సన్యాసమ్మ, మీనాక్షి, రఘు, రాజారావు, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్ఏలు

రాష్ట్ర అవతరణ దినోత్సవం మరువడం బాధాకరం

ఆమదాలవలస, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అవతరణ దినోత్సవం కూటమి ప్రభుత్వం మర్చిపోవడం బాధాకరమని మాజీ స్పీకర్, పార్లమెంటరీ వైసీపీ పరిశీలకులు తమ్మినేని సీతారాం అన్నారు. తన స్వగృహంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పండగ వాతావరణంలో నిర్వహించినట్టు గుర్తు చేశారు. ఇప్పుడు అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసేందుకు నాయకులే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ సిలెండర్ పథకం అందరికి అని చెప్పి కొందరికే అందిస్తున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అత్యాచారాలు, హత్యలు పెరిగాయన్నారు.

రీ సర్వేపై కలెక్టర్ ఫిర్యాదు

ఆమదాలవలస, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బూర్జ మండలం లచ్చయ్యపేట గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ రీసర్వే తప్పులు తడకగా జరిగిందని సువ్వారి గాంధీ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన మీకోసంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. లచ్చయ్యపేటలో 146మందికి పైగా రైతుల భూములు ప్రభుత్వ భూమిగా నమోదైందని, విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

రబీకి వేరుశనగ విత్తనాలు సిద్ధం

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది రబీలో పంట సాగునకు వేరుశనగ విత్తనాలు సబ్సిడీపై సిద్ధం చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సీజన్‌కు అనువైన కే-6, టీసీజీఎస్-1694(విశిష్ట) రకాల విత్తనాలు సరఫరా చేయడానికి ఒక కిలో విత్తనాలు రూ.98 కాగా, 40శాతం రాయితీ పోను రైతులు రూ.57.60 చెల్లిస్తే సరిపోతుందన్నారు. జిల్లాకు 4,533 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించామని, ఇందులో 4,518 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. మరో 2000 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపామన్నారు.

ఉపాధి పనులపై అవగాహన

లావేరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులపై గ్రామాల్లో వేతనదారులకు మ్యాప్‌ల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పాటు ఏ విధంగా పని కల్పించాలో మ్యాప్‌ల ద్వారా వివరిస్తున్నారు. సోమవారం గురుగుబిల్లిలో వేతన దారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీపీ నాయుడు, పంచాయతీ కార్యదర్శి భవానీ, సర్వేయర్ శైలజ, ఎఫ్ఏ రామారావు, మేట్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

సోలార్ ప్యానెల్‌కు కొలతలు తీస్తూ..

● మిల్లు పైరేకులు విరిగి యువకుడి మృతి


వెంకటరమణ (ఫైల్)

ఎల్.ఎన్.పేట/హిరమండలం నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మోదుగవలసజంక్షన్ సమీపంలోని దమయంతి మోడరన్ రైస్ మిల్లులో సోమవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ యువ కుడు మృతి చెందాడు. సరుబుజ్జిలి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. హిరమండలం మండలం సుభలయి గ్రామానికి చెందిన సాహుకారు వెంకటరమణ (28) దమయంతి రైస్ మిల్లుకు సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు గాను అవసరమైన కొలతలు తీసేందుకు మరో ముగ్గురు టెక్నీషియన్లతో కలిసి మిల్లు పైకి వెళ్లాడు. కొలతలు తీస్తుండగా వెంకటరమణ నిలుచున్న రేకు విరిగిపోయి కిందకు జారిపడి మృతిచెందాడు. ఈ ప్రమాదంలో ఎల్ఎన్‌పేట మండలం చింతలబడవంజికి చెందిన పోలినాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి తండ్రి ప్రసాద్, తల్లి మాణిక్యం, చెల్లెలు ఉన్నారు. ప్రమాద విషయం తెలుసుకున్న సరుబుజ్జిలి ఇన్‌చార్జి ఎస్ఐ టి. రాజేష్ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుభలయిలో విషాదం

వెంకటరమణ మృతితో ఆయన స్వగ్రామం హిరమండలం మండలం సుభలయి గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కొడుకు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న తల్లి దండ్రులు ఒక్కసారిగా కుప్పకూలారు. పేద కుటుంబం కావడం, తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో వారు బోరున విల పిస్తుండడంతో గ్రామస్థులు వేదనకు గురయ్యారు. వెంకటరమణ అందరితోనూ కలివిడిగా ఉండే వాడని, అకాల మరణం చెందడంతో గ్రామస్థులు విచారం వ్యక్తంచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సింహాచలం (ఫైల్)

కొత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వసప కాలనీ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. నివగాం గ్రామానికి చెందిన నూలు సింహాచలం (45) నివగాం నుంచి కొత్తూరు ద్విచక్ర వాహనంపై వస్తుండగా హడ్డుబంగి నుంచి కొత్తూరు వైపు వస్తున్న మరో బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో సింహాచలం గాయ పడ్డాడు. వెంటనే అతడిని స్థానిక సామాజిక ఆసు పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. కొత్తూరు ఎస్ఐ ఎంఏ అహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రై ఫ్రూట్స్ దుకాణంలో అగ్ని ప్రమాదం

టెక్కలి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ రోడ్డులోని సంతోషిమాత ఆలయం సమీపంలో డ్రైఫ్రూట్స్ దుకాణంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. దుకాణం నుంచి పొగలు వస్తుండడాన్ని స్థానికులు గమనించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

సారా తయారీ కేంద్రంపై దాడి


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

హిరమండలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): భగీరథపురం సమీపంలో ఉన్న కొండ ప్రాంతంలో సారా తయారు చేస్తున్నారన్న పక్కా సమాచారంతో సోమవారం దాడులు నిర్వహించి 700 లీటర్ల బెల్లం ఊటలు, 85 ప్యాకెట్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు శ్రీకాకుళం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ దాడులు నిర్వహించా మన్నారు. సారా తయారీదారులు తప్పించుకున్నారన్నారు. సారా తయారు చేసినా, అమ్మినా, తాగినా చట్టరీత్యా నేరమని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. దాడుల్లో కొత్తూరు సీఐ కిరణ్‌మణీశ్వరి, ఎస్ఐ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ఊటలు ధ్వంసం

సోంపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సోంపేట ఎక్సైజ్ అధికారులు సోమవారం నిర్వహించిన దాడుల్లో 960 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసినట్టు సీఐ కె.బేబీ తెలిపారు. అదేవిధంగా మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ ధరలకే అమ్మాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడ్ని మోసుకొస్తున్న 108 సిబ్బంది

జి.సిగడాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి గాయ పడ్డాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం జి.సిగడాం-నర్సింహపురం మధ్య రైల్వేట్రాక్‌పై జారిపడి ఉన్న వ్యక్తిని గమనించిన ట్రాక్‌మన్.. 108 సిబ్బందికి సమాచారం అందించారు. స్థానికుల తోపాటు 108 సిబ్బంది దాలినాయుడు, సతీష్‌కుమార్, చిన్న సాయంతో ఘటనా స్థలం నుంచి మూడు కిలోమీటర్లు ఆ వ్యక్తిని మోసుకుని వచ్చి.. 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. క్షతగాత్రుడి వివరాలు అడుగగా.. తనది ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా అని, పేరు హెన్నాగౌడ్ అని చెప్పినట్టు వారు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

జగన్నాయకుల ఆశయ సాధనకు కృషి


జగన్నాయకులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హరిపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): పేదల నాయకుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన సతీమణి, టీడీపీ నాయకురాలు జుత్తు ధనలక్ష్మి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ జుత్తు నీలకంఠం అన్నారు. మందస మండలం బిడిమిలో జగన్నాయకులు ఏడో వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పాటుపడిన వ్యక్తి జగన్నాయకులు అని అన్నారు. హరిపురం సర్పంచ్ పురుషోత్తం, నారాయణపురంలో సర్పంచ్ తేజేశ్వర రావు, బేతాళపురం బత్తిని లక్ష్మణ్, గొరకల వసంత స్వామి ఆధ్వర్యంలో జుత్తు వర్ధంతిని నిర్వహించారు.

స్థలాలను గుర్తించండి

ఎల్.ఎన్.పేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయం, సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలాలను గుర్తించాలని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ అన్నారు. తన కార్యాలయంలో సోమవారం మండల సర్వేయర్, ఆర్ఐలతో సమావేశమయ్యారు. జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తక్షణం తగు స్థలాలను గుర్తించాలని, ఆ నివేదికను కలెక్టర్ కార్యాలయానికి పంపించడం జరుగుతుందన్నారు.

చీపి వంతెనకు మోక్షమెప్పుడో?

హరిపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మందస-బుడార్సింగి మార్గంలో చీపి వద్ద గెడ్డ వద్ద నిర్మించిన వరద వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. సుమారు 70 గ్రామాలకు ప్రధాన రహదారిలో భారీ వర్షాలకు సిమెంట్ కట్టడం కొట్టుకుపోయి భారీ గొయ్యి ఏర్పడింది. లోపల పైపు మాత్రమే మిగలడంతో యువత, గ్రామస్థులతో కలిసి మట్టితో గొయ్యిని పూడ్చారు. అయితే భారీ వర్షాలు కురిస్తే మట్టికొట్టుకుపోయి ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని స్థానికులు వాపోతున్నారు. గతంలో చీపి బ్రిడ్జి నిర్మాణానికి ఐటీడీఏ అధికారులు ప్రతిపాదనలు చేసినా నేటికీ కార్యరూ పం దాల్చలేదు. వైసీపీ ప్రభుత్వంలో కనీసం దీనిపై కన్నెత్తి చూపలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో చీపి బ్రిడ్జి నిర్మాణంపై ఆశలు చిగురించాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గెడ్డపై శాశ్వత ప్రాతిపది కన వంతెన నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


వంతెన నిర్మించాల్సింది ఇక్కడే.. (వృత్తంలో) గొయ్యిని మట్టితో కప్పిన దృశ్యం

ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపాలి: ఐటీడీఏ పీవో


వినతులను స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గిరిజనుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదుకు పరి ష్కారం చూపాలని సీతంపేట ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మెళియాపుట్టి ఐకేపీ భవనంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చి సమస్యలపై పీవోకు వినతిపత్రాలను అందించారు. ఎక్కువగా గ్రామాలకు రోడ్లు నిర్మించాలని, తాగునీటి సరఫరా చేపట్టాలని ఫిర్యాదులు వచ్చాయని, వీటిని ఉపాధి హామీ నిధులతో కొన్ని పనులు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.

కొన్ని వినతులు ఇలా..

మండలంలో 25 గ్రామాలకు సరిగా రహదారులు లేవని మాజీ ఎంపీపీ బైరిశింగి లక్ష్మీనారాయణ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పెద్దమడి గిరిజన బాలికల ఆశ్ర మ పాఠశాలలో పనిచేయాల్సిన సీఆర్టీ సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసకు డెప్యు టేషన్ వేశారని, దీనిని రద్దు చేసి పెద్దమడిలో విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘం నాయకుడు సీహెచ్. శాంతారావు కోరారు. గిరిజన రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా పైపులు ఇచ్చి ఆదుకోవాలని మాజీ వైస్ ఎంపీపీ దినకరరావు విన్నవించారు. మెళి యాపుట్టిలో గిరిజన పెట్రోల్ బంకుతో పాటు పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని టీడీపీ నాయకుడు శ్రీనివాసరావు వినతి పత్రం అందించారు. మొత్తం 172 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఏఈని సస్పెండ్ చేయండి

ఏఈ శ్రీకాంత్‌ను సస్పెన్షన్ చేయాలని ఐటీడీఏ పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి ఈఈ రోజారాణిని ఆదేశించారు. 2016-17లో పెద్ద లక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలలో రూ.10 లక్షల ఐటీడీఏ నిధులతో పనులు చేసినప్పటికీ దీనికి సంబంధించిన బిల్లులు రూ.3 లక్షలు మాత్రమే చెల్లించారని, మిగిలిన బిల్లులు ఇవ్వాలని కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశారు. అయితే దీనికి సంబంధించి బిల్లులు తమకు సంబంధం లేదని ఏఈ సమాధానం చెప్పడంతో పీవో ఆగ్రహం వ్యక్తంచేసి ఆ ఏఈ సస్పెన్షన్ ఫైల్ సిద్ధం చేయాలని ఈఈని ఆదేశించారు. బాధ్యతగా వ్యవహరించకుంటే అధికారులపై చర్యలు తప్పవన్నారు. టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలి

టెక్కలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రహదారిపై భద్రత నిబంధనలు పాటించకుంటే ప్రమాదాలు తప్పవని సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం రాత్రి బన్నువాడలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించాలని, మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించాలని, ఓవర్‌లోడ్‌తో వాహనాలు నడపరాదన్నారు. సైబర్‌క్రైమ్‌కు బలవుతున్నారని, దానిపై అవగాహన పొందాలన్నారు. మహిళలు నడిచేటప్పుడు చీరకొంగు కప్పుకోవడం ద్వారా చైన్ స్నాచింగ్‌లు తగ్గుతాయన్నారు. వట్టికూళ్ల రామకృష్ణ, తిరుమలరావు, నంబాళ్ల రాంబాబు, ఎస్ఐ రాము, రఘునందనరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

నందిగాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలను సద్విని యోగం చేసుకోవాలని టెక్కలి ఏడీఏ బీవీ తిరుమలరావు అన్నారు. సోమవారం నందిగాం రైతు సేవా కేంద్రంలో వేరుశనగ, మినుము, రాగి విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.అజయ్ కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, కె.ప్రసాదరావు, ఏవో పి.శ్రీకాంత్‌వర్మ, జనసేన నేత తాడేల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో జెండాపేట

టెక్కలి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాతనౌపడా పంచాయతీ జెండాపేటలో వీధి లైట్లు వెలగ అంధకారం నెలకొంది. గ్రామంచుట్టూ పొలాలు ఉండడంతో విష సర్పాలు ప్రవేశిస్తున్నాయని, వీధి లైట్లు లేకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

జీడి పరిశ్రమల్లో జీఎస్టీ అధికారుల సోదాలు

పలాస, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో నాలుగు జీడి పరిశ్ర మల్లో కాశీబుగ్గ జీఎస్టీ అధికారులు సోమవారం సోదాలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి రెండు గంటల పాటు పరిశ్రమల్లో రికార్డులు, అమ్మకాలు, పన్నుల వివరాలను తనిఖీ చేశారు. బెల్లాల సత్యనారాయణ, ఎం.కాంతారావు, బి.నరేష్, కె.శివలకు చెందిన ప్రాసెసింగ్ యూనిట్లలో ఈ సోదాలు జరిగాయి. జీఎస్టీ జాయింట్ కమి షనర్ నాగార్జున ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమిషనర్ కొండమ్మ, డిప్యూటీ కమిషనర్ కేశవరావుతో పాటు అధికారులు సోదాల్లో పాల్గొన్నారు. రికార్డులను వారితో పట్టుకెళ్లారు.

'దాడులు జరుగుతున్నా పట్టించుకోరా?'

కోటబొమ్మాళి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కాలంలో దళితులపై నిరంతరం దాడులు జరుగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదని జిల్లా దళిత సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. కిష్టుపురానికి చెందిన చల్ల దమయంతిపై పలువురు దాడి చేయగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను జేఏసీ నాయకులు వై.గోపి, రాణా శ్రీను, గణేష్ పరామర్శించారు.

నైపుణ్యాభివృద్ధికి కృషి

నరసన్నపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు డా.బీఆర్ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ డా.పి.ఉదయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ కంప్యూటర్ సైన్స్, కెమిస్ట్రీ కోర్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పి.లత, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డా. గొలివి మోహన్, ఉణ్న రంగనాథ్, పోగోటి రాజా పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకే నైపుణ్య గణన: ఎమ్మెల్యే బగ్గు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, పాల్గొన్న సచివాలయ సిబ్బంది

పోలాకి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం నైపుణ్య గణన సర్వే చేపడుతోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గరిమెళ్ల రవికుమార్ అధ్యక్షతన సచివాలయ సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి సర్వేపై శిక్షణ నిర్వహించారు. నిరుద్యోగులకు అన్నిరంగాల్లో ఉపాధి కల్పించాలనే యోచనతో ప్రభుత్వం ఉందని, ఇటీవల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పారిశ్రామికవేత్తలతో సమీక్షించారన్నారు. రానున్న రోజుల్లో యువతకు మంచి ఉపాధి, భవిత ఉంటుందని భరోసా ఇచ్చారు. శిక్షణా తరగతులకు నోడల్ అధికారిగా జి.గౌతమ్‌ను నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు. సచివాలయ సిబ్బంది నుంచి ఉపాధి అవకాశాలకు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని సూచించారు. నిరుద్యోగుల ఇంటింటి వెళ్లి సర్వే చేయాలని సూచించారు.

గురుకులం సిబ్బంది పనితీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాత్రి విద్యార్థినుల భోజనాలు అయ్యే వరకు కూడా సిబ్బంది ఉండకుండా మధ్యాహ్నం 4.30 గంటలకే సిబ్బంది వెళ్లిపోవడం ఏమిటని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రిన్సిపాల్ జి.శ్రీరాములును ప్రశ్నించారు. కాగువాడలోని మహాత్మా జ్యోతీబాపూలే గురుకుల పాఠశాలను సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల నిర్వహణ ఇతర సదుపాయాలపై విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాల అంతా కలియతిరిగారు. వంటగదిని పరిశీలించి తయారు చేసిన వంట పదార్థాలను రుచి చూశారు. కూర ఉడకక పోవడాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉడకని బెండకాయల కూరా పిల్లల కు పెడతారా, ఇది న్యాయమా అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. వంట సిబ్బందిని ప్రశ్నించేందుకు ప్రయత్నించగా వారు 4.30 గంటలకే వంట ముగించుకుని వెళ్లిపోయారని ప్రిన్సిపాల్ తెలపడంతో అసహనానికి గురయ్యారు. రికార్డులను పరిశీలించారు. పిల్లలకు భోజనం పెట్టేవరకు సిబ్బంది ఉండరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గురుకులాల సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణమోహన్‌తో ఫోన్‌లో మాట్లాడి గురుకులంలో లోపాలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కార్యదర్శి కృష్ణమోహన్ స్పందిస్తూ.. హెడ్‌కుక్ ఎల్.ఇందిర, హెల్పర్ వై. సావిత్రిలను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీరాములు తెలిపారు.

ఆర్మీ ఉద్యోగుల సేవలు అభినందనీయం

పాతపట్నం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ ఉద్యోగుల సేవలు అభినందనీయమని, వారి జీవితాలు త్యాగాలకు ప్రతీకలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. విశ్రాంత ఆర్మీ ఉద్యోగుల సంక్షేమ భవనంలో సోమవారం ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సరిహద్దులో ఇండియన్ ఆర్మీ ఉన్నారనే భరోసాతోనే ప్రతీ పౌరుడూ ధైర్యంగా ఉండ గలుగుతున్నారన్నారు. కూటమిప్రభుత్వం వంద రోజుల పాలనలో మాజీ సైనికోద్యోగుల సంక్షేమానికి రూ.10 కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమావేశానికి సుబేదార్ రామారావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పలువురు సంఘ నేతలు, విశ్రాంత సైనికోద్యోగులు పాల్గొన్నారు.

కాలువల్లోని పైప్‌లైన్లు తొలగింపు



కాలువలోని పైపులైన్లు తొలగించిన దృశ్యం

హిరమండలం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్కరాపల్లి పంచాయతీ సీది గ్రామంలో మురుగు కాలువలో ఉన్న రక్షిత నీటి పైపులైన్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తొలగించారు. రక్షిత నీటి పథకం పనిచేయక గ్రామంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులుపై సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'రక్షిత జలం.. అందనంత దూరం' శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాగర్ గ్రామానికి వెళ్లి మరమ్మతులకు గురైన నీటి పథకాన్ని పరిశీలించారు. కాలువలో ఉన్న పైపులైన్లను బయటకు తీయించారు. ఆయన మాట్లాడుతూ.. రూ.2.60 లక్షల పంచాయతీ నిధులతో నీటి పథకం మరమ్మతులు చేయించి కొళాయిల ద్వారా తాగు నీరందిస్తామన్నారు. తొలగించిన పైప్‌లైన్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామన్నారు.

స్వయంభూలింగేశ్వరుడికి పూజలు


పలాస రూరల్: సవర గోవిందపురంలో స్వయంభూలింగేశ్వరుడిని దర్శించుకుంటున్న భక్తులు

పలాసరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని.. పలాస మండలం సవరగోవిందపురంలో స్వయంభూలింగేశ్వరుడికి భక్తులు పూజలు చేశారు. అలాగే బ్రాహ్మణతర్లా, కేదారిపురం, అల్లుకోల, లొద్దభద్ర, తర్లాకోట, కైజోల, సున్నాడ, లక్ష్మీపురం, కిష్టుపురం, గోపాలపురం, మాకన్నపల్లి, బొడ్డపాడు, రంగోయి గ్రామాల్లో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మొరాయించిన ఆర్టీసీ బస్సు

వజ్రపుకొత్తూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పూండి బస్టాండ్ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు మొరాయించి నిలిచిపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పలాస నుంచి వస్తున్న టెక్కలి డిపోకు చెందిన స్టూడెంట్స్ స్పెషల్ బస్సు బస్టాండ్ వద్ద ఒక్కసారి నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, స్థానికులు బస్సును తోసినప్పటికీ ముందుకు కదల్లేదు. దీంతో వారంతా ఇతర వాహనాలను ఆశ్రయిం చారు. కాలం చెల్లిన బస్సులను నడపడం వల్లే ఇటువంటి పరిస్థితి ఎదురవుతోందని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కండిషన్‌లో ఉన్న బస్సులను ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

ఇంటర్వ్యూ

డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకోండి

● ఏటీడబ్ల్యూవో శ్రీనివాసరావు



హరిపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గిరిజన యువతీ యువకులకు నిర్వహిస్తున్న డీఎస్సీ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏటీడబ్ల్యూవో పి.శ్రీనివాసరావు కోరారు.

ప్రశ్న: డీఎస్సీకి ఎంతమందికి అవకాశం ఉంది?

జవాబు: డీఎస్సీ ఉచిత కోచింగ్ గిరిజన యువతీ యువకులకు ఒక వరం. సుమారు 1,110 మందికి అవకాశం కల్పించనున్నాం.

ప్ర: ఉచిత కోచింగ్‌కి అర్హతలేమిటి?

జ: టీటీసీ, బీఈడీ చదివిన ఎస్టీ అభ్యర్థులు అర్హులు. ముందుగా ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 10న శ్రీకాకుళం, టెక్కలిలో జరిగే పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి.

ప్ర: వీరికి అందించే సౌకర్యాలేమిటి?

జ: గిరిజన, ఎస్సీ విద్యార్థులకు కలిపి ఉచిత కోచింగ్ ఇవ్వనున్నాం. యువతీ, యువకులకు వేర్వేరుగా వసతి గృహాలను ఏర్పాటు చేసి ఉచిత భోజనంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం.

ప్ర: డీఎస్సీ శిక్షణ ఎక్కడ ఇస్తున్నారు?

జ: డీఎస్సీలో ఉద్యోగం సాధించే లక్ష్యంగా విశాఖపట్నం, విజయవాడ వంటి పట్టణాల్లో ఉచిత కోచింగ్ అందిస్తున్నాం.

న్యూస్ బాక్స్

ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా?

నరసన్నపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియాపై ప్రభుత్వం కక్షకట్టి కేసులు పెడుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆదివారం ఒక్కరోజే 42 కేసులు పెట్టారన్నారు. జిల్లాలో వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలను స్టేషన్లకు పిలిపించి వేధిస్తున్నారని, ప్రశ్నించే గొంతులను నొక్కేస్తారా అని ప్రశ్నించారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నరసన్నపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో నరసన్నపేట జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. శని, ఆది, సోమవారాల్లో గుంటూరు జిల్లా తెనాలిలో ఈ పోటీలు నిర్వహించగా అండర్-17 విభాగంలో వీరహనుమాన్ వ్యాయామశాలలో శిక్షణ పొందిన జూనియర్ కళాశాల విద్యార్థులు పి.రాజేష్, పి.గణేష్ వివిధ విభాగాల్లో వెండి పతకాలు సాధించినట్లు కోచ్ అప్పలరామన్న తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు

హరిపురం, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు జీఆర్ పురం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ఎర్రన్నాయుడు సోమవారం తెలిపారు. అథ్లెటిక్స్ అండర్-14 కేటగిరిలో డిస్క్‌త్రో వాలీబాల్‌కు దుంపల సోనీ ప్రియ, త్రోబాల్‌కు దేశెట్టి ప్రతాప్, అండర్-17 కేటగిరిలో త్రోబాల్‌కు బేసి హర్షవర్ధన్ ఎంపికయ్యారన్నారు. ఈనెల ఆరు నుంచి ఏలూరులో జరగనున్న పోటీల్లో పాల్గొంటారన్నారు.